

తైక్వాండో పోటీల్లో సత్తా

జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో 88 పాయింట్లకు 35 పాయింట్లు సాధించి ఓవరాల్ ఛాంపియన్‌గా పోరుమామిళ్ల విద్యార్థులు నిలిచారని మాస్టర్ నాయబ్ తెలిపారు. -8లో



వైఎస్ రాజారెడ్డి మా కుటుంబానికి స్ఫూర్తి ప్రదాత

మా కుటుంబానికి స్ఫూర్తి ప్రదాత వైఎస్ రాజారెడ్డి అని, ఆయన పేద ప్రజలకు ఆత్మీయుడు అని వైఎస్ విజయమ్మ పేర్కొన్నారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.0/27.4

జిల్లాలో గురువారం 27.4 - 35.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

మహా వైఫల్యం

- టీడీపీ నేతల అంచనాలు తారుమారు
- జనాలు రాకపోవడంతో నిరుత్సాహం
- నేతల ప్రసంగాలకు జనాల నీరసం
- మూడురోజుల ముచ్చటగా ముగిసిన 'మహానాడు'

కడప రూరల్: తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహానాడు ఫ్లాప్ షోగా మిగిలింది. గురువారం జరిగిన బహిరంగ సభ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి నేతల ప్రసంగాలతో ప్రారంభమైంది. చివరన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రసంగించారు. సాయంత్రం 5.30 గంటలకు బహిరంగ సభను ముగించేశారు.

నేతల్లో నీరసం...

ఆ పార్టీ అధినాయకత్వం వ్యూహాత్మకంగా కడపలో మహానాడును పెద్ద ఎత్తున నిర్వహించాలని తలపెట్టారు. తద్వారా వైఎస్సార్ జిల్లాతో పాటు రాయలసీమ వ్యాప్తంగా పట్టు సాధించాలని భావించారు. ఈ కార్యక్రమం విజయవంతానికి ఆ పార్టీ అగ్రనేతలంతా కడపలోనే మకాం వేశారు. బహిరంగ సభకు 5 లక్షల నుంచి 7 లక్షల మంది హాజరవుతారని గొప్పగా చెప్పారు. బహిరంగ సభ సమయం రానే వచ్చింది. నేతల అంచనాలు తల్లకిందులయ్యాయి. సభకు హాజరైన జనాలను చూసి పార్టీ నేతల్లో నిరుత్సాహం కలిగింది. అధికార యంత్రాంగాన్ని అంతా మోహరించినా, అనుకున్న దాని కంటే తక్కువ సంఖ్యలో జనాలు హాజరు కావడంపై గొప్పలు చెప్పుకున్న నాయకులు దిక్కులు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వచ్చిన వారి ఇబ్బందులు...

భారీగా జన సమీకరణ కోసం అధికార యంత్రాంగం అంతా కసరత్తు చేసింది. బస్సులతో పాటు ఇతర వాహనాల్లో పలు ప్రాంతాల నుంచి జనాలను తీసుకొచ్చారు. వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బహిరంగ సభా ప్రాంగణానికి 3 కిలో మీటర్ల దూరానికి పైగా వాహనాలు నిలిపేశారు. అక్కడి నుంచి జనాలు సభ వద్దకు రావడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నిర్వాహకులు సభా ప్రాంగణంతో పాటు వచ్చే ప్రధాన అన్ని ప్రాంతాల్లో భోజన సదుపాయాలు కల్పించామని చెప్పినా ఆచరణలో అమలు కాలేదు. ఫలితంగా సభకు వచ్చిన జనాలు ఆకలితో అలమటించారు. నిర్వాహకులు పటిష్ట చర్యలు చేపట్టకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి.



కడప మహానాడు వేదిక వద్ద సీఎం చంద్రబాబు మాట్లాడుతుండగా ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

భద్రతా ఏర్పాట్ల పరిశీలన

కడప అర్బన్: మహానాడు బహిరంగ సభలో అత్యాధునిక డ్రోన్ టెక్నాలజీ ద్వారా భద్రతా ఏర్పాట్లను ఐజీపీ (ఆపరేషన్స్) సీహెచ్ శ్రీకాంత్ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించారు. 23 డ్రోన్లు, 4 అత్యాధునిక 'టెదర్ టెక్నాలజీ' డ్రోన్లను వినియోగిస్తూ ట్రాఫిక్, పార్కింగ్ పై ఎప్పటికప్పుడు విహంగ వీక్షణం ద్వారా పర్యవేక్షిస్తూ పోలీస్ అధికారులకు ప లు సూచనలు చేశారు.



డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ చేస్తున్న ఐజీపీ శ్రీకాంత్

నేతల ప్రసంగాలకు స్పందన లేమి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు మంత్రి నారా లోకేష్‌తో సహా నేతల ప్రసంగాలకు జనాల నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదు. అంతా మౌన వ్రతం దాల్చినట్లుగా ఉండిపోయారు. నేతలు అనుకున్న విధంగా జనాలు రాకపోగా వచ్చిన వారు సభ ప్రారంభం కాగానే బయటికి వెళ్లడం కనిపించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం ప్రారంభ కాగానే సభ నుంచి జనాలు వెళ్లిపోవడం మరింతగా పెరిగింది. నేత ల నిరాశల మధ్య మూన్నాళ్ల ముచ్చటగా 'మహానాడు'ముగిసిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రయాణికుల కస్సుబస్సు

- మహానాడు సభకు 1847 బస్సుల వినియోగం
- ప్రజలకు తప్పని ప్రయాణ కష్టాలు
- గంటల తరబడి నిరీక్షణ
- భారీ జన సమీకరణ కోసం డ్వాక్రా మహిళలు, ఉపాధి కూలీల తరలింపు

సాక్షి కడప: తెలుగుదేశం పార్టీ నిర్వహించిన మహానాడుకు జనాలను తరలించేందుకు తమ్ముళ్లు నానా తంటాలు పడ్డారు. భయపెట్టో.. బెదిరించో..తీసుకు రావడం ఒక ఎత్తయితే, మరోవైపు ఆర్టీసీ బస్సులన్నీ మహానాడు వైపే వేయడంతో ప్రయాణికుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. గంటల తరబడి బస్టాండులో నరక యాతన అనుభవిస్తున్నా ఏమి అని అడిగేవారు లేక పోగా..ఎప్పుడు వస్తాయనే చెప్పేవారు లేకపోవడంతో ప్రయాణానికి కష్టాలు ఎదుర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు సైతం ముఖ్యమంత్రి హోదాలో అక్కడే ఉండడం..మంత్రులు, అధికార పార్టీ నేతలంతా అక్కడే మకాం వేయడంతో అధికార యంత్రాంగం సైతం వారి మెప్పుకోసం వెంపర్లాడిందే తప్ప ప్రజల కష్టాలను గాలికి వదిలేసింది. వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లోని బస్టాండ్లలో ఎక్కడ చూసినా జనాలు బస్సుల కోసం నిరీక్షిస్తూ కనిపించారు. గంటల తర్వాత వచ్చిన ఒకటి, రెండు బస్సుల కోసం తోపులాటలు..సీట్ల కోసం వెంపర్లాడుతూ సర్కార్ తీరును తూర్పారబట్టడం కనిపించింది.

- మహానాడు చివరి రోజు బహిరంగసభ జనం కోసం టీడీపీ నానా తిప్పలు పడింది. తక్కువ జనాలు కనిపిస్తే మహానాడు విఫలమైందన్న భావన కలుగుతుందని ఎక్కడికక్కడ డ్వామా మహిళలను, ఉపాధి కూలీలను తరలించారు. మహానాడా...మజాకా అన్నట్లు అటు డ్వాక్రా మహిళలు, ఉపాధి కూలీలు కచ్చితంగా రావాలంటూ అల్టిమేటం జారీ చేసి తీసుకెళ్లారు. ఎక్కడ చూసినా సభ వద్ద, బయటి ప్రాంతాల్లో డ్వాక్రా మహిళలు దర్శనమిచ్చారు. . యానిమేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లను ఇంత మందిని తరలించాలని...బస్సులో తీసుకొచ్చిన వారి ఫొటోలతో పాటు సంతకాలను తీసుకున్నట్లు తెలియవచ్చింది.



మహానాడు సందర్భంగా బస్సులు లేకపోవడంతో బస్టాండులో నిరీక్షిస్తున్న ప్రయాణికులు



బస్సులు లేక బస్టాండ్లు వెలవెల

కడపలో జరుగుతున్న మహానాడుకు సంబంధించి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 1847 బస్సులను వినియోగించారు. సుదూర ప్రాంతాలతోపాటు రాయలసీమ ప్రాంతంలోని అన్ని డిపోల నుంచి పెద్ద ఎత్తున బస్సులను వినియోగించడంతో ఆర్టీసీ బస్టాండులో బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనంతపురం జిల్లా నుంచి 170, సత్యసాయి 167, చిత్తూరు 130, తిరుపతి 245, నంద్యాల 196, కర్నూలు 110, వైఎస్సార్ కడప 274, అన్నమయ్య 240, ప్రకాశం 85, నెల్లూరు 230 బస్సులను వినియోగించారు. ఆర్టీసీ బస్సులు మహానాడు దారి పట్టడంతో బస్టాండులు ఖాళీగా దర్శనమిచ్చాయి.ప్రయాణికులకు నిరీక్షణ తప్పలేదు. మహానాడు పుణ్యమా అని పలువురు ప్రయాణికులు తాము పడుతున్న కష్టాన్ని చెబుతూ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.

గ్లాసు పట్టు.. మందు కొట్టు.. మద్యం మత్తులో తెలుగు తమ్ముళ్లు



మహానాడు.. మందు.. విందు

- గల్లి నుంచి ప్రధాన రహదారుల్లో ఎక్కడ చూసిన మద్యం ప్రియులే
- జనసమీకరణ కోసం డబ్బుల పంపిణీ, వాహనాలు ఏర్పాటు
- ఎండవేడిమికి తట్టుకోలేని జనం మధ్యలోనే నిష్క్రమణ

సాక్షి ప్రతినిధి, కడప: మహానాడు.. మందు.. విందు.. మూడుముక్కల్లో చెప్పాలంటే మూడు రోజుల పసుపు పండగ సాగిన తీరిదే.. ముఖ్యంగా కడప గడపలో మద్యం ఏరులై పారింది. కడప నగరంలో నెలరోజులు పాటు ఖర్చు అయ్యే మద్యం మూడు రోజుల్లోనే ఖర్చైంది. గురువారం బహిరంగసభ కారణంగా గ్రామాల గల్లీల నుంచి ప్రధాన రహదారుల వరకూ మందుబాబులు తాగి చిందులేశారు. జనసమీకరణ కోసం పచ్చనోట్లు పంచడంతో అందుకున్న ప్రజలు ఎక్కడిక్కడ మద్యం తాగు తూ కనిపించారు.కొందరు తూలి కింద పడ్డారు..నిద్రలోకి జారుకున్నారు. మహానాడు సందర్భంగా సమీపంలోని వైన్ షాపులను మూసివేసి ఉండే బాగుండేదని పలువురు అభిప్రాయపడ్డారు.

- కడప గడపలో 22 మద్యంషాపులుంటే దాదాపు అన్నింట్లో రద్దీ విపరీతంగా ఉండిపోయింది. మంగళ, బుధవారాలల్లో నగరంలోని మద్యంషాపులల్లో వ్యాపారం రూ.65లక్షలు చొప్పున చోటుచేసుకోగా గురువారం 5 రెట్లు అధికంగా దాదాపు రూ.3కోట్లు పైబడి వ్యాపారం లభించినట్లు సమాచారం. చిత్తూరు-కర్నూల్ జాతీయ రహదారి వెంబడి మందుబాబులు తిష్టవేసి మద్యం సాగారు. ఇటు కడప-రేణిగుంట రహదారిలో కూడా ఇదే పరిస్థితి.

కడపలో వలసపక్షులకే ప్రాధాన్యత...

కడప నియోజకవర్గంలో దశాబ్దాలుగా ఉన్న కార్యకర్తలకు న్యాయం లభించలేదని టీడీపీ మాజీ మహిళా అధ్యక్షురాలు చిప్పగిరి మీనాక్షి ఆరోపిస్తూ బుధవారం సెల్ టవర్ ఎక్కి నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. గురువారం మరో మారు అదే విషయం తేటతెల్లమైంది. వలస పక్షులకు జనసమీకరణ బాధ్యతలు అప్పగించారు. వారి చేతికే డబ్బులు అప్పగించి జనాన్ని సమీకరించాలని ఆదేశించినట్లు సమాచారం. పాత తరం నేతలెవ్వరిని జనసమీకరణలో ప్రోత్సహించలేదని సమాచారం. కడప నగరంలో డ్వాక్రా మహిళలు కదలకుంటే జనం ఆశించిన స్థాయిలో వచ్చే అవకాశమే లేదని ఆ పార్టీ సీనియర్ నాయకుడొకరు చెప్పుకొచ్చారు.

పాపం.. డ్వాక్రా మహిళలు

ముఖ్యమంత్రి బహిరంగసభకు డ్వాక్రా సభ్యులు కచ్చితంగా హాజరు కావాలని యానిమేటర్లు అల్టిమేటం జారీ చేశారు. ఎవరైనా హాజరు కాలేని పక్షంలో వారి తరుపునా కూలీలను హాజరు పర్చాలని ఆదేశించారు. ప్రతి సంఘం వారి వారి గ్రూపు ఫొటో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే భవిష్యత్‌లో ప్రభుత్వ పథకాలు ఏవీ వర్తించవని డ్వాక్రా గ్రూపు లీడర్లను యానిమేటర్లు బెదిరించారు. యానిమేటర్లు వాయిస్ మెసేజ్ వైరల్ కావడంతో డ్వాక్రా సభ్యులు పెద్ద ఎత్తున మహానాడు సభకు హాజరయ్యారు. గ్రామాల కంటే పట్టణాలు, నగరాలల్లోని డ్వాక్రా సభ్యులు భారీగా తరలి రావడంతో దాదాపు 40శాతం మంది సభా ప్రాంగణంలో మహిళలే కనిపించారు.

ఎండవేడిమికి వెనుతిరిగిన జనం...

మహానాడు బహిరంగసభకు జనాన్ని సమీకరించారు, కానీ వారిని సభ అయ్యేంత వరకూ అలాగే నిలువరించలేపోయారు. ప్రజలు ఎండ వేడిమికి తట్టుకోలేకపోయారు. కాసేపు కూర్చున్నా వెనుకవైపు నుంచి జనం జారుకోవడం కనిపించింది. 3గంటలకు వేదిక మీదకు సీఎం రావడం 4.20 నిమిషాలకు ప్రసంగం మొదలు పెట్టారు. అప్పటికే బాగా జనం వెనుకడుగు వేస్తుండడం కన్పించింది.

అభివృద్ధికి నిర్దిష్ట ప్రణాళిక ఏదీ?

ముఖ్యమంత్రి ఇక్కడే ఉన్నారు, చర్చించారు, అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు రచించారు. రాయలసీమ అటుంచితే కనీసం కడప జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రచించారనుకున్న వారికి చేదు అనుభవమే ఎదురైంది. జిల్లాలోని గండికోట రిజర్వాయర్‌ను నాన్ ప్రియారిటీ జాబితాలో పెట్టిందే చంద్రబాబు హయాంలోనే జిల్లాలో పాతతరం నాయకులు ఎవరైనా సరే, ఆ విషయాన్ని స్పష్టంగా వెల్లడించగలరు. కడప ఎమ్మెల్యే కోరిక మేరకు దేవుని కడపను పర్యాటక కేంద్రంగా చేస్తామని ప్రకటించడం మినహా నిర్దిష్టమైన ప్రణాళిక వెల్లడించలేదు. కమలాపురం ఎమ్మెల్యే ఏపీఐఐసీ భూములల్లో భారీ పరిశ్రమ ఏర్పాటుకు శ్రీకారం చుట్టాలని కోరినా సీఎం నోటా హామీ లభించకపోవడం గమనార్హం.



మద్యం తాగుతున్న టీడీపీ కార్యకర్తలు..



మత్తులో తూలి..



సభా వేదిక సమీపంలో...

న్యూస్‌రీల్

డీసీసీబీ చైర్మెన్‌గా సూర్యనారాయణరెడ్డి

కడప అగ్రికల్చర్: డీసీసీ బ్యాంక్ చైర్మెన్‌గా సూర్యనారాయణరెడ్డిని అధికారంగా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. రిజిస్ట్రార్ ఆఫ్ కో ఆపరేటివ్ సొసైటీ నుంచి ప్రొసీడింగ్ రాగానే సూర్యనారాయణరెడ్డి డీసీసీ బ్యాంకు చైర్మెన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

స్తంభించిన రాకపోకలు

రాయచోటి:మహానాడు కార్యక్రమం సందర్భంగా కడప-రాయచోటి మార్గంలోని గువ్వలచెరువు ఘాట్‌రోడ్డులో రాకపోకలు స్తంభించిపోయాయి. గురువారం మధ్యాహ్నం అన్నమయ్య, చిత్తూరు జిల్లాలోని నియోజకవర్గాల నుంచి వాహనాల రాకతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వం రవాణా విషయంలో జాతీయ రహదారి, ఘాట్ రోడ్డు దృష్ట్యా ప్రత్యేక నిర్వాహక చర్యలు తీసుకోకపోవడంతో ట్రాఫిక్ తీవ్రరూపం దాల్చిందని పలువురు విమర్శించారు.

గడువు పొడిగింపు

కడప సెవెన్‌రోడ్స్: జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మూడు నెలలు పొడిగించారు. ఈ మేరకు కడప సమాచార శాఖ డీపీఆర్వో వేణుగోపాల్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం ప్రస్తుతం మే 31 నాటికి అక్రిడిటేషన్ కార్డులు వాలిడిటీ కలిగి పనిచేస్తున్న పాత్రికేయులకు మాత్రమే మరో మూడు నెలలు జూన్ 1, 2025 నుంచి ఆగస్టు 31, 2025 వరకు ఈ పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందని, సంబంధిత మీడియా యాజమాన్యం వారి సంస్థలో పని చేస్తున్న, తొలగించిన జర్నలిస్టుల వివరాలు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి కార్యాలయంలో అందచేయాలని డీపీఆర్వో ఆ ప్రకటనలో తెలిపారు.

టీడీపీ కుట్రలు పటాపంచలు

- మేయర్ అనర్హత ఉత్తర్వులపై హైకోర్టు స్టే
- కడప ఎమ్మెల్యే మాధవికి చుక్కెదురు

కడప కార్పొరేషన్: కడప మేయర్ సురేష్ బాబుపై ప్రభుత్వ విప్ మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి చేసిన కుట్రలు ఫలించలేదు. మేయర్‌పై ఫిర్యాదు చేసి అనర్హత వేటు వేయిస్తూ పురపాలక శాఖతో వారు ఇప్పించిన ఉత్తర్వులపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్టే విధించింది. వివరాలిలా ఉన్నాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులపై కుట్రలు, కుతంత్రాలు మొదలు పెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లను ప్రలోభపెట్టడం, సామ, దాన, భేద, దండోపాయాలతో బెదిరించి టీడీపీలో చేర్చుకోవడం ద్వారా మేయర్, మున్సిపల్ చైర్మన్ స్థానాలను కుతంత్రాలతో చేజిక్కించుకోవడం ఒక తంతుగా మారింది. కడపలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆర్.మాధవి ఆధ్వర్యంలో అంతకు రెట్టింపు స్థాయిలో కక్షసాధింపు చర్యలు ఊపందుకున్నాయని చెప్పవచ్చు. నగర ప్రథమ పౌరుడైన మేయర్ సురేష్ బాబు ఇంటిపై చెత్త వేయించిన ఎమ్మెల్యే మాధవి రెడ్డి....నగరపాలక సర్వసభ్య సమావేశంలో మేయర్‌తో సమానంగా తనకు కుర్చీ వేయకపోవడంపై మరింత రెచ్చిపోయారు. ఎలాగైనా సరే మేయర్‌ను పదవీచ్యుతుడిని చేయాలన్న కక్షతో ఎమ్మెల్యే, ఆమె భర్త, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి స్వయంగా రంగంలోకి దిగి మేయర్‌పై మున్సిపల్ శాఖకు ఫిర్యాదులు చేశారు. మేయర్ కుమారుడు కాంట్రాక్టు వర్కులు చేశారని విజిలెన్స్‌కు ఫిర్యాదు చేసి, మున్సిపల్ చట్టంలోని చిన్న లొసుగును ఆధారంగా చేసుకొని ఆయనపై అనర్హత వేటు వేయించారు. ఈనెల 14వ తేదీ పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ అనర్హత వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై మేయర్ సురేష్‌బాబు హైకోర్టును ఆశ్రయించారు. మేయర్ వేసిన పిటిషన్‌ను సింగిల్ బెంచ్ తోసిపుచ్చడంతో...ఆయన డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. గురువారం దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం మేయర్ సురేష్ బాబుపై అనర్హత వేటు వేస్తూ పురపాలక శాఖ ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించింది.



అపూర్వ ఫంక్షన్ హాలులో మేయర్ సురేష్ బాబును కలిసి సంఘీభావం తెలుపుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, బద్వేల్ ఎమ్మెల్యే దాసరి సుధ

సంఘీభావం తెలిపిన నేతలు

న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ మేయర్ సురేష్ బాబుకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, బద్వేల్ ఎమ్మెల్యే డా. దాసరి సుధ, కార్పొరేటర్లు తదితరులు మేయర్‌ను కలిసి సంఘీభావం తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకుల సంబరాలు

హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పుతో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు, నాయకులు సంబరాలు చేసుకున్నారు. గురువారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయం వద్ద, అపూర్వ ఫంక్షన్ హాలులో పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి సంతోషం వ్యక్తం చేశారు. రాజకీయ కక్షతో ఎమ్మెల్యే మాధవి ఎన్ని కుట్రలు చేసినా అంతిమంగా న్యాయమే గెలిచిందని వారు తెలిపారు.

కడప ఎమ్మెల్యే మాధవికి చెంపపెట్టు

హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వ విప్ మాధవికి చెంపపెట్టుగా పరిశీలకులు భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్తి మెజార్టీ ఉన్న నగరపాలక సంస్థపై పెత్తనం చెలాయించాలని అన్ని రకాల ప్రయత్నాలు సాగిస్తూ వస్తున్నారు. సర్వసభ్య సమావేశంలో ఎక్స్ అఫిషియో సభ్యురాలిగా పాలకవర్గానికి సూచనలు, సలహాలు ఇవ్వాల్సిన ఆమె, మేయర్‌తో సమానంగా కుర్చీ వేయలేదని కవ్వింపు చర్యలకు దిగారు. మొండిపట్టుదలతో మేయర్ సురేష్ బాబుపై అనర్హత వేటు వేయించి...మాజీ మేయర్ అంటూ హేళన చేసి తమ అనుచరులతో కార్పొరేషన్ వద్ద బాణసంచా కాల్చి...పైశాచిక ఆనందం పొందారు. తాజాగా న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ఆమెకొక గుణపాఠంలాంటిదని విశ్లేషకులు భావిస్తున్నారు.



మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు

85 మందికి పదోన్నతి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా జెడ్పీ హైస్కూల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్స్‌కు గ్రేడ్ -2 ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించేందుకు నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. కడపలోని గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్లో డీఈఓ షేక్ షంషుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కౌన్సెలింగ్‌లో జిల్లావ్యాప్తంగా జెడ్పీ హైస్కూల్స్‌లో పనిచేస్తున్న 85 మంది స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులను కల్పించినట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. ఏడీ మునీర్‌ఖాన్, డీసీఈబీ సెక్రటరీ విజయబాస్కర్‌రెడ్డి, డీఈఓ కార్యాలయ సిబ్బంది నాగేశ్వరెడ్డి, ఏసన్న, సాయి, నిఖిల్, బాష తదితరులు పాల్గొన్నారు.



పదోన్నతిలో పాల్గొన్న అధికారులు

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కాశినాయన : మండలంలోని జ్యోతిక్షేత్రం సమీపంలోని గరుడాద్రి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కాశినాయన పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా అప్పటికే గుర్తు పట్టలేని విధంగా ఉంది. పోరుమామిళ్ళ వైద్యాధికారి కరీమ్ ఘటన స్థలానికి వచ్చి పోస్టుమార్టం చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న చాంద్‌బాషా

కలసపాడు : మండలంలోని ఎగువ తంబళ్ల పల్లె గ్రామానికి చెందిన షేక్ ఇమాంసాబ్ కుమారుడు షేక్ చాంద్‌బాషా (24) గురువారం ఉదయం ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చాంద్‌బాషా కలసపాడులో మోటారు మెకానిక్‌గా పనిచేస్తుండేవాడు. కడుపునొప్పితో ఆరోగ్యం సరిగా లేక రెండు సార్లు ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నాడు. అయినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. స్థానికులు గమనించి తలుపులు తీయగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భక్తులకు అసౌకర్యం లేకుండా యోగా కార్యక్రమం


అధికారులకు సూచనలిస్తున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

నందలూరు : శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయంలో ఈ నెల 31వ తేదీన నిర్వహించే యోగా కార్యక్రమం వల్ల భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులకు సూచించారు. యోగ కార్యక్రమ ఏర్పాట్లపై శనివారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యక్రమానికి కలెక్టర్ చామకూరి శ్రీధర్ హాజరవుతారన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని, అందుకు పోలీసుల సహకారం తీసుకోవాలని తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్ సౌమ్యనాథ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టూరిజం అధికారి నాగభూషణం, ఎంపీడీఓ రాధాకృష్ణంరాజు, ఈఓఆర్‌డీ సునీల్‌కుమార్, డాక్టర్ కార్తీక్‌విశ్వనాథ్, ఎంఈఓలు అనంతకృష్ణ, నాగయ్య, ఏఓ మల్లికార్జున, ఏపీఓ మురళి, ఏపీఎం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

బెరైటీస్ మిల్లులను ఆదుకోవాలి

ఓబులవారిపల్లె : మంగంపేట ఏపీఎండీసీ గనుల బెరైటీస్ ఖనిజం ఆధారితంగా నిర్మించిన పల్వరైజింగ్ మిల్లులను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీఎండీసీ గనుల విస్తరణలో ఇల్లు, భూములు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాల వారు అప్పులు చేసి స్థానికంగా చిన్న పరిశ్రమలైన మిల్లులను ఏర్పాటు చేసి అందులో యాభై మందికి జీవనోపాధి కల్పిస్తున్నారన్నారు. దాదాపు 175 మిల్లులు ఉన్నాయన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక ఎగుమతిదారులకు సీ అండ్ డీ గ్రేడ్ ఖనిజం ధర తగ్గించి ఇవ్వడం మిల్లులకు మరో ధర ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మిల్లులకు రాయితీలతో ఖనిజాన్ని సరఫరా చేసే వారన్నారు. మిల్లులకు రాయితీపై ఖనిజం సరఫరా లేక మిల్లులన్నీ మూతపడి కార్మికులు జీవనోపాధి కోల్పోయారన్నారు.

వైఎస్ రాజారెడ్డి మా కుటుంబానికి స్ఫూర్తి ప్రదాత

- ఆయన పేద ప్రజలకు ఆత్మీయుడు
- వైఎస్ కుటుంబం నుంచి ఇద్దరు ముఖ్యమంత్రులను అందించిన ఘనత ఆయనకే దక్కుతుంది
- ఆయన స్ఫూర్తితో వైఎస్సార్, వైఎస్ వివేకా, జగన్, షర్మిల, అవినాష్ ప్రజాసేవ
- మాజీ ఎమ్మెల్యే వైఎస్ విజయమ్మ


పులివెందులలో వైఎస్ రాజారెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వైఎస్ విజయమ్మ, తదితరులు


వైఎస్ రాజారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

పులివెందుల : మా కుటుంబానికి స్ఫూర్తి ప్రదాత వైఎస్ రాజారెడ్డి అని, ఆయన పేద ప్రజలకు ఆత్మీయుడు అని దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ సతీమణి, పులివెందుల మాజీ ఎమ్మెల్యే వైఎస్ విజయమ్మ పేర్కొన్నారు. గురువారం దివంగత నాయకుడు వైఎస్ రాజారెడ్డి శత జయంతి సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక డిగ్రీ కళాశాల రోడ్డులో ఉన్న వైఎస్సార్ సమాధుల తోటలోని వైఎస్ రాజారెడ్డి వైఎస్ జయమ్మ సమాధుల వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం స్థానిక సీఎస్ఐ చర్చిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనలలో ఆమె కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వైఎస్ విజయమ్మ మాట్లాడుతూ వైఎస్ రాజారెడ్డి కుటుంబంలో చూపిన ప్రేమను, ఆయనను నమ్ముకున్న వారికి అండగా ఉండటంలోనూ, ప్రజల కష్టసుఖాలను పంచుకోవడంలోనూ, అన్నదమ్ముల విషయంలో, అక్కాచెల్లెళ్ల పట్ల బాధ్యతగా ఉండటంలోనూ, ప్రజలపట్ల సేవా తత్పరత కలిగి ఉండటం ఇవన్నీ కూడా ఆయనలో ఉన్న సుగుణాలు అన్నారు. రాజారెడ్డి కుటుంబానికి తాము ఐదుగురం కోడళ్లం, అయినా ఏరోజు తమను కోడళ్లుగా చూడలేదని, కన్నబిడ్డల్లాగానే చూసుకున్నారన్నారు. అదేవిధంగా ప్రజలపట్ల కూడా ఆయన సేవా భావంతో ఉండేవారన్నారు. ముఖ్యంగా ఆయన ప్రజలకు సహాయం చేయాలన్న తలంపుతో వారి బిడ్డలలో ఒకరైన వైఎస్ రాజశేఖరరెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు, వైఎస్ వివేకానందరెడ్డిని పూర్తిగా రాజకీయాల్లో పనిచేసేందుకు స్వాతంత్య్రం ఇచ్చారన్నారు. ఆయన స్ఫూర్తితో జగన్ మోహన్‌రెడ్డి అయినా, షర్మిల అయినా, వైఎస్ అవినాష్‌రెడ్డి అయినా సేవలు అందిస్తున్నారన్నారు. రాజశేఖరరెడ్డిని సీఎంగా చూడాలని చిరకాల వాంఛ అని అది చూడలేకపోయారన్నారు. కుటుంబం నుంచి ఇద్దరు ముఖ్యమంత్రులను అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఏ సమస్య వచ్చినా, ఏ బాధ వచ్చినా రాజారెడ్డి వద్దకు వస్తే ఆ సమస్యను ఆయనే తీరుస్తారనే నమ్మకం ప్రజలలో ఉండేదన్నారు. ఆరోగ్యం కోసం ఆరోజు వైఎస్ రాజారెడ్డి ఆసుపత్రిని కట్టి కొడుకును ఇక్కడ పెట్టి ఒక్క రూపాయి వైద్యం అందించారన్నారు. చదువుల కోసం డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, ఇంటర్మీడియట్ కళాశాల పెట్టారన్నారు. అలాగే ప్రజల సమస్యలను నేరుగా పరిష్కరించి ప్రజల హృదయాలలో పెద్దాయనలాగా నిలిచిపోయారని గర్వంగా చెబుతున్నానన్నారు. వైఎస్ కుటుంబీకులలో రాజకీయ పునాది వేసిన రథ సారథి ఎవరంటే రాజారెడ్డి అన్నారు. రాజారెడ్డి ఒక వ్యక్తి కాదు, ఒక స్ఫూర్తి అన్నారు. అలాంటి స్ఫూర్తిని మనం కూడా పొందాలని, ఆయన ఆశయాలను గుర్తుకు తెచ్చుకోవాలని, ఆయన పైనుంచి మనందరిని కూడా గర్వపడేలా చూసేలా బతకాలని కోరారు. అలాగే వైఎస్ రాజారెడ్డి శత జయంతి సందర్భంగా స్థానిక వైఎస్ రాజారెడ్డి మెమోరియల్ పార్కులో ఉన్న వైఎస్ రాజారెడ్డి విగ్రహానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్ విజయమ్మ, జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ, వైఎస్సార్ సోదరులు సుధీకర్‌రెడ్డి, రవీంద్రనాథరెడ్డి, మైఖేల్ బాబు, షర్మిలమ్మ, వైఎస్ ప్రకాష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

భూ తగాదా కేసులో ఆరుగురి అరెస్టు

చాపాడు : మండల పరిధిలోని రాజుపాళెం గ్రామంలో జరిగిన భూ తగాదా కేసులో ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఏఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. పల్లెం శ్రీనివాసులు, మహేష్ బాబు, వెంకట రమణ, వెంకటసుబ్బయ్య, సురేష్, సతీష్ కుమార్‌లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

నలుగురిపై తేనెటీగల దాడి

సిద్దవటం: మండల కేంద్రమైన సిద్దవటంలోని గురుకుల కళాశాల సమీపంలో గురువారం నలుగురు వ్యక్తులపై తేనెటీగలు దాడిచేశాయి. సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని గురుకుల కళాశాల వద్ద ఉన్న తేనె తుట్టెపై ఆకతాయిలు రాళ్లు వేశారు. దీంతో అవి ఒక్కసారిగా బయటకు వచ్చాయి. రహదారి వెంబడి వెళుతున్న వారిపై దాడిచేసి గాయపరిచాయి. ఈ దాడిలో జంగాలపల్లె, మూలపల్లె, సిద్దవటం, భాకరాపేట గ్రామాలకు చెందిన వెంకటబాలాజీ, మల్లికార్జున, అమీర్ బాషా, మరొకరు గాయపడ్డారు. వీరికి సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ ప్రకాష్ ఆధ్వర్యంలో చికిత్స చేశారు. వైద్యాధికారి డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ అమీర్‌బాషా ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందన్నారు.

తైక్వాండో జిల్లా స్థాయి పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులు


బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు

పోరుమామిళ్ల : పోరుమామిళ్లలో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో 88 పాయింట్లకు 35 పాయింట్లు సాధించి ఓవరాల్ ఛాంపియన్‌గా పోరుమామిళ్ల విద్యార్థులు నిలిచారని మాస్టర్ నాయబ్ రసూల్ తెలిపారు. బంగారు పతకాలు సాధించిన వీరంతా తాడిపత్రిలో జూన్ నెలలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థుల వివరాలు ఇలా..

బాలుర సబ్‌జూనియర్స్ విభాగంలో..
మోక్షిత్, హుసేన్, తస్వీక్ అయాన్, మహమ్మద్ సమీర్, సయామ్‌బాషా, సదీష్, సఫాన్, జస్వంత్

బాలికల సబ్ జూనియర్స్ విభాగంలో..
శ్రీ గీతిక, హరిణి, తత్వికవనమా, దివ్య నాగ హర్షిత

క్యాడియేట్ బాయ్స్ విభాగంలో..
గురు వెంకట తేజస్, పర్వీజ్, అబ్దుల్ అజీజ్, ఫయుం బాషా, మహబూబ్ సుహాన్, శివ సాత్విక, రిత్విక్, శివరామకృష్ణ

క్యాడియేట్ బాలికల విభాగంలో..
నాగదీపిక, లక్కీ, లోక్షిత

జూనియర్స్ బాలుర విభాగంలో..
అబూబకర్, సాజిత్, హరుణ్, సాయి కృష్ణ తేజ, చరణ్

జూనియర్స్ బాలికల విభాగంలో..
మాధవి, ధనిషా, మౌనిక, ఆఫ్రిన్

సీనియర్స్ బాలుర విభాగంలో..
అమరనాథ్, నయామ్

సీనియర్స్ బాలికల విభాగంలో..
భవ్య, తస్లీమ్

సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు


ఎముకల పొడి ప్యాకెట్లను పరిశీలిస్తున్న డాక్టర్ ముంగేష్ దుబే, ఇతర అధికారులు

రాయచోటి టౌన్ : నూనె గింజల పంటల సాగుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని భారత నూనె గింజల పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ముంగేష్ దుబే అన్నారు. గురువారం రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల గ్రామంలో నూనె గింజల సాగుపై రైతులతో సమావేశం నిర్వహించారు. దేశ వ్యాప్తంగా 700 జిల్లాలో రెండు వేలకు పైగా శాస్త్రీయ బృందాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు మాట్లాడుతూ నూతన వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలన్నారు. పండ్ల తోటల సాగులో కూడా కొత్తరకాల పండ్ల తోటలను ఎంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని వాటి ద్వారా మంచి దిగుబడులతో పాటు అధిక లాభాలు ఆర్జించవచ్చని చెప్పారు. ఏరువాక (ఖరీఫ్) సేద్యానికి రైతులు సిద్ధం కావాలని రాయచోటి వ్యవసాయ శాఖ అధికారి దివాకర్ రైతులకు కోరారు. వేరుశనగ, కంది, నువ్వులు వంటి వ్యవసాయ పంటల సాగులో పాటించాల్సిన పద్ధతులను కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ మహేశ్వరి సూచించారు. డాక్టర్ ఐ.సురేష్ కుమార్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ నాగేశ్వరరావు, రైతులు రామకృష్ణం రాజు, ఉద్యానశాఖ అధికారిణి నాగమణి, ఆత్మ ఏటీఎంలు, రైతులు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న లారీ

మహిళ ఎడమ చేయి నుజ్జునుజ్జు


ప్రమాదంలో నుజ్జు నుజ్జయిన సునీత ఎడమచేయి

పుల్లంపేట : కడప–చెన్నై జాతీయ రహదారి మోడల్ స్కూల్ సమీపంలో గురువారం బైకును లారీ ఢీకొన్న సంఘటనలో బైకుపై వెళ్తున్న మహిళ ఎడమ చేయి లారీ కింద పడటంతో నుజ్జునుజ్జు అయింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వీరబల్లి మండలం, తొట్టికిందపల్లి దళితవాడ గ్రామానికి చెందిన రామ్మోహన్, సునీత దంపతులు. వీరు సునీత పుట్టినిల్లు అయిన పుల్లంపేట మండలం, అనంతంపల్లి పంచాయతీలోని జానకీపురానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. పుల్లంపేట మోడల్ స్కూల్ సమీపంలోకి రాగానే కడప–రేణిగుంట జాతీయ రహదారిపై ఎదురుగా లారీ అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. ఈ ప్రమాదంలో రామ్మోహన్‌కు తీవ్ర గాయాలు కాగా, సునీత కుడిచేతికి స్వల్ప గాయాలు కాగా, ఎడమ చేయి లారీ కిందపడటంతో నుజ్జు నుజ్జు అయ్యింది. క్షతగాత్రులను హుటాహుటిన రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యంకోసం తిరుపతికి తీసుకెళ్లినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రేపు ములకలచెరువులో జాబ్ మేళా

రాయచోటి టౌన్ : ఈ నెల 31వ తేదీ ములకలచెరువులోని బ్లాసమ్ డిగ్రీ కళాశాల ఆవరణలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు అన్నమయ్య జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి నుంచి డిగ్రీ పూర్తి చేసిన వారితో పాటు ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసిన 18 – 30 సంవత్సరాల యువతీయువకులు హాజరు కావచ్చని పేర్కొన్నారు.

డ్వాక్రా మహిళల తరలింపు సరికాదు

మదనపల్లె రూరల్ : డ్వాక్రా మహిళలను రాజకీయ పార్టీల సమావేశాలకు బలవంతంగా తరలించడం సరైనది కాదని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్.నరసింహులు అన్నారు. మహిళా సాధికారత, ఆర్థికాభివృద్ధి కోసం స్వయంప్రతిపత్తితో డ్వాక్రా సంఘాల ఏర్పాటు జరిగిందన్నారు. వీటిపైన రాజకీయ జోక్యం ఏమాత్రం తగదన్నారు. గ్రామీణ, పట్టణ డ్వాక్రా మహిళలను రాజకీయ పార్టీల సమావేశాలకు బలవంతంగా తీసుకెళ్లడం, మీటింగ్‌లకు రాకపోతే మీకు లోన్లు ఇవ్వమని, డ్వాక్రా గ్రూపుల గ్రేడింగ్‌ను తగ్గిస్తామని బెదిరించడం సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ విషయమై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

చంద్రా కాలనీలో చోరీ

మదనపల్లె రూరల్ : పట్టణంలోని చంద్రాకాలనీలో చోరీ జరిగిన విషయం గురువారం వెలుగుచూసింది. స్థానికంగా ఉండే కుమార్ కుటుంబంతో కలిసి ఈనెల 21న బంధువుల ఇంటికి కడపకు వెళ్లాడు. బుధవారం రాత్రి తిరిగి ఇంటికి రాగా తలుపులు, తాళాలు పగలగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా, చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనలో రూ.60వేల విలువచేసే బంగారు నగలు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుని వెళ్లినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

పైనాపిల్ కాసింది..!



అనంతంపల్లిలో విరగకాసిన పైనాపిల్

పుల్లంపేట : పుల్లంపేట మండలం, అనంతంపల్లి గ్రామానికి చెందిన శేషారెడ్డి తన ఇంటిలో పైనాపిల్ మొక్క తెచ్చి నాటాడు. దీంతో పైనాఫిల్ విరగకాయడంతో గ్రామంలోని ప్రజలు వింతగా చూస్తున్నారు. సాధారణంగా ఈ ప్రాంతంలో పైనాపిల్ పండదని, అలాంటిది శేషారెడ్డి ఇంటిలో విరగకాయడంతో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

నిమ్మతోట దగ్ధం

పెనగలూరు : పెనగలూరు మండలం, కాకర్లవారిపల్లి పంచాయతీ వెంకటనారాయణ పల్లి వద్ద నిమ్మతోట దగ్ధమైనట్లు ఫైర్ అధికారి శివయ్య తెలిపారు. గురువారం వేపాటి వారిపల్లికి చెందిన పి.పెంచలయ్య నిమ్మతోట అగ్నికి ఆహుతవుతుండగా ఫైర్ సిబ్బందికి ఫోన్ చేయడంతో వెంటనే వారు అక్కడికి చేరుకుని ఆర్పివేసినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో చుట్టూ ఉన్న కంచె పూర్తిగా దగ్ధమైంది. సకాలంలో ఫైర్ సిబ్బంది స్పందించడంతో నిమ్మతోట పూర్తిగా దగ్ధం కాలేదు. దాదాపు రూ.80 వేలకుపైగా నష్టం వాటిల్లినట్లు ఫైర్ అధికారి తెలిపారు.

భవన నిర్మాణాలకు పటిష్టమైనది భారతి సిమెంట్


మేస్త్రీలకు బీమా పత్రాలను అందజేస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

ఒంటిమిట్ట : అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలకు భారతి సిమెంట్ పటిష్టమైందని భారతి సిమెంట్ డీజీఎం ఓబుల్ రెడ్డి, జిల్లా ప్రధాన మార్కెటింగ్ అధికారి ప్రతాప్ రెడ్డి, జిల్లా టెక్నికల్ ఇంజినీర్ శ్రీకాంత్ రెడ్డి, సేల్స్ ఆఫీసర్ రమణా రెడ్డి తెలిపారు. ఒంటిమిట్టలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర ఎంటర్‌ప్రైజెస్ సమీపంలోని మేస్త్రీలకు సిమెంట్ వినియోగంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా భారతి సిమెంట్ ప్రతినిధులు మాట్లాడుతూ భారతి సిమెంట్ రోబోటిక్ టెక్నాలజీతో తయారవుతుందని, అల్ట్రాఫాస్ట్ నాణ్యత కలిగి ఉంటుందన్నారు. రొబోటిక్స్ ప్రయోగశాల, జర్మన్ టెక్నాలజీ తక్కువ సమయంలో ఎక్కువ కట్టడాలు చేయగల సామర్థ్యం కలవన్నారు. ఇతర కంపెనీల సిమెంట్ ఐదు గంటల్లో సెట్ అయితే భారతి అల్ట్రాఫాస్ట్ రెండు గంటల్లో సెట్ అవుతోందని, దృఢత్వం కల్గి ఉంటుందని, కట్టడాలు త్వరగా పూర్తవుతాయని తెలిపారు. అనంతరం మేస్త్రీలకు లక్ష ఉచిత బీమా బాండ్, బీమా పత్రాలను యాభై మంది మేస్త్రీలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ పాండురంగారెడ్డి, మేస్త్రీలు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఘాట్ వద్ద షర్మిల ఘన నివాళి


వైఎస్సార్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న పీసీసీ చీఫ్ షర్మిల, తదితరులు

వేంపల్లె : వేంపల్లి మండలంలోని ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న వైఎస్సార్ సమాధి వద్ద పీసీసీ చీఫ్ షర్మిల ఘనంగా నివాళులర్పించారు. గురువారం పులివెందుల పర్యటనకు విచ్చేసిన ఆమె వేంపల్లె మండలంలోని ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రానికి విచ్చేశారు. వైఎస్సార్ సమాధి వద్ద పుష్పగుచ్ఛం ఉంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు అక్కడే ఉన్న వైఎస్సార్ విగ్రహానికి కూడా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కాంగ్రెస్ నాయకులతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం పని చేయాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో వైఎస్సార్ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి, ప్రొద్దుటూరు కాంగ్రెస్ సమన్వయ కర్త ఇర్ఫాన్ బాషా, పులివెందుల సమన్వయ కర్త ధృవకుమార్ రెడ్డి, వేంపల్లె మండల అధ్యక్షుడు రామకృష్ణ, రామాంజనేయరెడ్డి, బాలం సుబ్బరాయుడులతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అహల్య బాయి త్రిశతాబ్ది జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి

రాయచోటి టౌన్ : అహల్య బాయి హోల్కర్ త్రి శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకుందామని కేంద్ర సమాచార ప్రసార శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల సహాయమంత్రి ఎల్.మురుగన్ పేర్కొన్నారు. గురువారం రాయచోటి సాయి సుధ కల్యాణ మండపంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ ఆధ్వర్యంలో ఈ నెల 31వతేదీన జరిగే త్రి శతాబ్ది జయంతి వేడుకల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆమె కాశీ నుంచి కన్యాకుమారి వరకు దేవాలయాల పునర్నిర్మాణానికి చేసిన కృషి అమోఘమైనదన్నారు. బాల్య వివాహాల నిర్మూలన కోసం కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ జకియా ఖానం, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్, జిల్లా మహిళా అధ్యక్షురాలు సునీత నారాయణ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా మాతంగి మహా పీఠం

రాయచోటి టౌన్ : లక్కిరెడ్డిపల్లె మండలంలోని మాతంగి మహా పీఠం అధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందుతుందని కేంద్ర సమాచార ప్రసార శాఖ, పార్లమెంట్ వ్యవహారాల సహాయ మంత్రి మురుగన్ అన్నారు. జగద్గురు శ్రీ ఆది శంకరాచార్య శ్రీ శారద లక్ష్మి నరసింహ పీఠాధిపతులు స్వయంప్రకాశ సచ్చిదానంద స్వామి సరస్వతి సంకల్పం మేరకు లక్కిరెడ్డిపల్లెలోని దొర్రిచెరువు సమీపంలో శ్రీమాతంగి మహాపీఠ శిల శాస్త్ర ప్రతిష్టకు ఆయన హాజరయ్యారు. ముందుగా రాయచోటిలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో అల్పాహారం చేశారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ మహా పీఠం ప్రపంచానికి ఆధ్యాత్మికను నేర్పి ఆది గురువుగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో కర్నాటక రాష్ట్ర ఆహార, ప్రజా సరఫరాల శాఖ మంత్రి కెహెచ్ మునియప్ప, బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.